ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఫీజుల దందాను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫీజుల నియంత్రణ, అవశ్యకత అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఫీజుల నియంత్రణ చట్టానికి రూపకల్పన చేయాలని కోరారు. విద్యా రంగంలో వ్యాపార ధోరణి చాలా ప్రమాదకరంగా మారిందన్నారు. కార్పొరేట్ విద్యా విధానం విద్యలో అసమానతలు పెంచుతుందని తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టసాధనకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యా విధానం వల్ల పేద విద్యార్థులు చదువుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఫీజులను నియంత్రణ చేయడంతో పాటు విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజు, పుట్టా లక్ష్మణ్, మణికంఠరెడ్డి, రామకృష్ణా, జావేద్, ఆజాద్, ఎ.విజయ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌తో పరేషాన్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీఎం రామకృష్ణ, డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఉమాకాంత్ తదితరులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీకాలనీ ప్రధాన రోడ్డులో మూడు రోజుల క్రితం డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో స్థానికంగా డ్రైనేజీ మురుగునీరు ఇండ్లలోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించడంతో జలమండలి ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. శుక్రవారం పద్మశాలీ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి మ్యాన్‌హోల్ పూర్తిగా మట్టితో నిండిపోయింది. దీంతో డ్రైనేజీ మురుగునీరు వెళ్లేందుకు ఆస్కారం లేకపోవడంతో ఇండ్లలోకి మురుగునీరు రావడం వల్ల మూడు రోజుల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం కార్తీక్‌రెడ్డిలు ఘటన స్థలానికి చేరుకొని యుద్ధప్రాతిపదికన యంత్రాల సాయంతో కుంగిన మ్యాన్‌హోల్ వద్ద తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్ వేశారు. దీంతో స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం అయింది. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి సహకరించిన ఉమాకాంత్, జీఎం, డీజీఎం, సెక్షన్ మేనేజర్ ప్రసాద్ బాబులను పూలమాలలు వేసి సత్కరించారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కలుషిత నీటి నివారణ పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ లీకేజీ వల్ల కలుషిత నీటి సమస్య ఏర్పడటంతో శుక్రవారం జలమండలి అధికారులు పనులు చేపట్టారు. కలుషిత నీటికి కారణమైన చోట తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులను ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ముషీరాబాద్ మహంకాళీ దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు ఈ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మంచినీటిని అందించాలని వారు అధికారులను కోరారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



పోలీసు అధికారులకు సన్మానం చేస్తున్న సొసైటీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందిన పోలీసులు అధికారులను సిటీ పోలీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వారికి వీడ్కోలు పలికారు. శుక్రవారం సర్వీసు సూపర్ యాన్యుయేషన్ నుంచి పదవీ విరమణ చేస్తున్న పలువురు పోలీసు అధికారులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధా రాణి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ ప్రెసిడెంట్, సొసైటీ సెక్రటరీ నల్లా శంకర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ ద్వారా రిటైర్‌మెంట్ ప్రయోజనాలను వారికి అందజేశారు. 8 మంది ఎస్ఐలు, ఒకరు ఆర్ఎస్ఐ, 11 మంది ఏఎస్ఐలు, ఇద్దరు ఏఆర్ఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, మరో ముగ్గురు మొత్తం 33 మంది సభ్యులను సత్కరించారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఆసిఫ్ ఖాన్, జాయింట్ సెక్రటరీ సి.నవీన్ కుమార్, కోశాధికారి జి.ఎం.ఎస్.విక్టర్, సొసైటీ డైరెక్టర్ పి.వినీత్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు మంచి గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: ఉద్యోగ విధులను అంకితభావంతో నిర్వహించిన ఉద్యోగులు, అధికారులకు ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని నగర కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి పి.పద్మజ అన్నారు. పదవీ విరమణ చేసిన గ్రేడ్–2 లైబ్రేరియన్ సుధాకర్, గ్రేడ్–3 లైబ్రేరియన్ శైలజను శుక్రవారం చిక్కడపల్లిలోని వట్టికోట ఆళ్వారుస్వామి స్మారక నగర కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ... విరమణ ఉద్యోగానికి తప్ప వయసుకు కాదన్నారు. గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్, పెన్షర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కుల దేవేందర్, బుచ్చయ్య, సత్యనారాయణ, వెంకటేశ్, సుకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటుగా చేయాలి



మాట్లాడుతున్న వేదకుమార్ తదితరులు

హిమాయత్‌నగర్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలకు పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమకారుడు కాసుల రవికుమార్ మంచి కంటి వరంగల్ జిల్లా నర్సంపేట నుండి మే 26న తెలంగాణ వ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర మొదటి దశ ముగింపు సభ శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకూబ్, బాల చెలిమి నిర్వాహకులు ప్రముఖ విద్యావేత్త మణికొండ వేదకుమార్, గ్రంథాలయ పితామహ పద్మశ్రీ వెంకటరమణయ్య మనువడు అయ్యంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ అధికారులను కించపరిస్తే సహించం



ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ అధికారులను కించపరిస్తే సహించేది లేదని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ అధికారులను కించపరిచిన శివారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. 24 గంటలో క్షమాపణ చెప్పకుంటే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, మధు, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యలపై పారాహుషార్

- లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ముంపు సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోండి
- సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్



అంబర్‌పేట నాలాను పరిశీలిస్తున్న జెడ్‌సీ రవికిరణ్, డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పును నివారించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న నాలా ప్రాంతాలను డీఎంసీ మారుతీదివాకర్‌తో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలో ప్రవహిస్తున్న ఉస్మాన్‌సాగర్ నాలా, మొయిన్ చెరువు నాలా, మూసీనది సమీపంలో ఉన్న ఎస్టీపీ ప్లాంట్‌లను ఆయన సందర్శించారు. నాలాలో పూడికతీత పనులు, వర్షపు నీరు ప్రవహించే మార్గాల్లో సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. నాలాల్లో పూడిక లేకుండా పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. గత ఏడాది వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తిన ప్రాంతాలను గుర్తించి ఈ ఏడాది పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. నాలాల్లో నీరు సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. వర్షాలు పడితే ప్రజలకు అవసరమైన ఎలాంటి సాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, బీఈ రఘు, ఏఈ విజ్ఞేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సన్మానం



ముషీరాబాద్: విదేశీ పర్యటన ముగించుకొని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుక్రవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుల పాటి మోజెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. భారత జాగృతి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పరకాల మనోజ్‌గౌడ్, డివిజన్ ఉపాధ్యక్షులు మార్క రమేష్‌యాదవ్, శ్రావణ్ కుమార్, ప్రవీణ్ ముదిరాజ్, డింబి మున్నానాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



చిక్కడపల్లి: సూపర్ స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో సూపర్ స్టార్, పద్మభూషణ్ దివంగత కృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అధ్యక్షుడు దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులు పి.మల్లేష్, రాజిరెడ్డి, వెంకటేశ్‌యాదవ్, రాజు, శ్రీధర్, రామకృష్ణగౌడ్, ఎస్ఎస్‌కే రాజు, సాయికుమార్, యశ్వంత్, చందు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని యువతి అదృశ్యం



రమ్య

అంబర్‌పేట: తల్లి మందలించిందని ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన శుక్రవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చెప్పల్‌బజార్‌లో నివసించే ప్రతాప్ కూతురు రమ్య(23) సమీపంలోని ఓ వ్యక్తితో తరుచూ మాట్లాడుతోంది. గమనించిన తల్లి నిర్మలమ్మ వద్దని మందలించింది. దీంతో రమ్య శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని కుక్ మృతి

అంబర్‌పేట: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... వంట మనిషిగా పనిచేసే ఫారూక్‌నగర్‌కు చెందిన షేక్ రఫీస్(53) ఫలక్‌నమా–శివరాంపల్లి మధ్యన పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడిక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రౌడీషీటర్ రిమాండ్

బంజారాహిల్స్: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహమత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్‌లో ఉండే సాయికిరణ్‌రెడ్డి అలియాస్ సాయికిరణ్ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో నిందితుడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐపీసీ సెక్షన్ 353, 506, మొహినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐపీసీ సెక్షన్ 504, 498 (ఏ), రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెక్షన్ 25(1) ఆమ్స్‌యాక్ట్ కింద సాయికిరణ్‌పై కేసులు నమోదై ఉన్నాయి. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కేసీఆర్‌ను అరెస్టు చేయాలి

బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు



ధర్నాకు తరలివెళ్తున్న బీజేపీ నేతలతో గౌతమ్‌రావు

అంబర్‌పేట: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను అరెస్టు చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ అధిష్టానం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు శుక్రవారం అంబర్‌పేట డివిజన్ నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నదని ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగభూషణం చారి, యశ్వంత్, నవీన్‌రెడ్డి, రాంచందర్, వెంకటస్వామి, అయోధ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా పక్వాడాను ముగించిన ఎన్‌టీపీసీ

సాక్షి, సిటీబ్యూరో: ఎన్‌టీపీసీ సదరన్ రీజియన్ హెచ్‌క్యూ ఆధ్వర్యంలోని 15 రోజుల స్వచ్ఛతా పక్వాడా పరిశీల కార్యక్రమాన్ని కవాడిగూడలోని కార్యాలయం వేదికగా ఘనంగా ముగించింది. రెండు వారాలుగా పరిశుభ్రమైన, స్థిరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం, దాని ఆవశ్యకతను గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన చెట్ల పెంపకం, ప్రభాత్ ఫేరీ, పెయింటింగ్ పోటీలు, వ్యాసరచన వంటి పలు కార్యక్రమాల్లో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌హెచ్‌క్యూ, జీహెచ్ఎంసీ సహకారంతో చార్మినార్ వద్ద చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. మేకలమండీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభతో అలరించారు. విజేతలకు సంస్థ ఈడీ ప్రసేన్‌జిత్ పాల్, బీఎస్ రావులు బహుమతులను అందించారు. ముగింపు వేడుకల్లో భాగంగా పక్వాడా కార్యకలాపాలను ప్రతిబింబించే షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. జీఎం ఎస్ఎన్ పాణిగ్రహి, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పద్మావతీరెడ్డి తదితరులు

అంబర్‌పేట: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకురుస్తాయని మాజీ కార్పొరేటర్ కె.పద్మావతీరెడ్డి అన్నారు. సయోధ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులకు పలు అంశాల్లో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె చిన్నారులను అభినందించారు. విద్యార్థి దశలోనే చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, వంటి అంశాలపై అభిరుచి పెంచుకోవాలని సూచించారు. నిర్వాహకులు సవ్రంతి, శైలజ, లత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మనీల్యాండరింగ్ కేసు నమోదయిందని భారీ మోసం

ఢిల్లీ పోలీసు పేరుతో ఓ వ్యాపారి నుంచి రూ. 23 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: ఢిల్లీలో మనీల్యాండరింగ్ కేసు నమోదయిందని, ఢిల్లీ పోలీసుల పేరుతో కాల్ చేస్తున్నామని ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన 64 ఏళ్ల ఓ వ్యాపారికి ఢిల్లీలోని లజ్‌పత్ నగర్ పోలీస్ స్టేషన్‌లోని సీనియర్ హెడ్ కానిస్టేబుల్ పేరుతో సైబర్ నేరగాళ్లు కాల్ చేశారు. ఐసిఐసిఐ బ్యాంక్‌లో మనీలాండరింగ్ కేసులో ప్రమేయం ఉందని, ఎన్‌డిహెచ్ఎస్/1306/2024 కేసు నంబర్‌తో కేసు నమోదయినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ కాల్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌కు బదిలీ చేశారు. నవాబ్ మాలిక్ పేరితో రూ.300 కోట్ల మనీలాండరింగ్ కేసు నమోదయిందని, ఈ కేసుతో బాధితుడికి కూడా సంబంధం ఉందని భయపెట్టారు. న్యూఢిల్లీలోని ఐసిఐసిఐ బ్యాంక్‌కు చెందిన ఏ బ్రాంచ్‌లోనూ ఖాతా లేదని, తనకు నవాబ్ మాలిక్ తెలియదని బాధితుడు పేర్కొన్నాడు. దీంతో సీబీఐ, ఆర్థిక శాఖ నుండి అరెస్ట్ వారెంట్, నోటీసులను అతనికి పంపించారు. బాధితుడిని వెరిఫికేషన్ కోసం తన సేవింగ్స్ ఖాతాలో డబ్బును బదిలీ చేయమన్నారు. తర్వాత 15 నిమిషాల్లో అది తిరిగి పంపిస్తామని నమ్మించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు తన యెస్ బ్యాంక్‌లోని పొదుపు ఖాతా నుంచి రూ. 23 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం కేటుగాళ్లు హఠాత్తుగా వీడియో కాల్‌ను డిస్‌కనెక్ట్ చేశారు. వారు పంపిన నోటీసులు, సందేశాలు, అరెస్ట్ వారెంట్‌లన్నీ డిలీట్ చేశారు. వారి నంబర్లకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ప్రేమ వ్యవహారమే కారణమని తండ్రి ఫిర్యాదు

ఖైరతాబాద్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ మార్కెట్ రోడ్డులో నివాసముండే బండారు వేణుగోపాల్ పెద్ద కుమారుడు బండారు శుషాంత్(20) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో తండ్రి బండారు వేణుగోపాల్‌తో పాటు తల్లి, చిన్న కుమారుడు బంధువుల దిన కార్యక్రమాలకు వెళ్లారు. ఇంట్లో శుషాంత్ ఒంటరిగానే ఉన్నాడు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు డోర్ కొట్టినా తలుపు తీయకపోవడంతో ఫోన్ చేశారు ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి పైన ఉన్న గదిలోకి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఉండటాన్ని గమనించి వెంటనే వాసవి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. తండ్రి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తన కుమారుడికి మెహిదీపట్నంలో నివాసముండే ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని.. ఆ విషమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని తెలిపినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

- శివం ఫీడర్ పరిధిలో పీఆర్‌టీ క్వార్టర్స్, శివం టెంపుల్, ప్రశాంతీనగర్, నర్సింహ్మబస్తీ, తరుణి సూపర్ మార్కెట్, విద్యానగర్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.
- డీడీ కాలనీ ఫీడర్ పరిధిలో రామచంద్రయ్య డిగ్రీ కాలేజ్, గ్లాస్‌కో, హిల్టన్ కేఫ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.
- అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయిదత్త నర్సింగ్‌హోమ్, టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్, శివం, మల్లికార్జుననగర్, ఎరుకల బస్తీ, బతుకమ్మ కుంట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.
- రెడ్ బిల్డింగ్ ఫీడర్ పరిధిలో న్యూ వినాయక్‌నగర్, రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ వివరించారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్వర్ణపతకాలతో సత్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినీవిద్యార్థులకు అవోపా బ్యాంక్‌మెన్ చాప్టర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని పరీక్షా కేంద్రాల్లో ఈ ఏడాది నీట్, జేఈఈ, పరీక్షలు రాసి మొదటి వెయ్యి రాంకులు సాధించిన వారిలో వంద మంది విద్యార్థులను స్వర్ణ పతకాలతో సన్మానించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పి.వి.రమణయ్య తెలిపారు. ఈ నెల 30వ తేదీన ఆదివారం 9 గంటలకు లక్డీకాపూల్‌లోని వాసవి సేవా కేంద్రంలో సత్కరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన ఫారం హార్డ్ కాపీకి ఫొటో, ఇతర ఎంక్లోజర్స్ జతపరచాలన్నారు. చివరి తేదీ జూన్ 20వ అన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్స్: 94419 28528, 92905 29133లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సమష్టిగా నిర్వహించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా నిర్వహించుకోవాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు, సామాజిక ఉద్యమ నేత డాక్టర్ చిక్క దేవదాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం అవతరించిందన్నారు. పార్టీలన్ని ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎస్వీ కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఎస్వీ కృష్ణారెడ్డి

ముషీరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు, సంగీత దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎలివెట్స్ ఎలైట్ కల్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలివెట్స్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కల్చరర్ అసోసియేషన్ సంగీత విభావరి నిర్వహించి ఆయన సంగీత దర్శకత్వం వచ్చిన పాటలను సినీ గాయకులు ఆలపించి శ్రోతలను ఉర్రుతలూగించారు. కార్యక్రమానికి ముందు దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డిలు కేక్‌కట్ చేశారు. కల్చరర్ అసోసియేషన్ నిర్వాహకులు కామేశ్వర్‌రావు, ఆనంద్‌కుమార్, రజనీ, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి వన్నెతెచ్చిన ఎన్టీఆర్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: నందమూరి తారకరామారావు మహా నటుడని మా కమిటీ సభ్యుడు, నటుడు మాణిక్ అన్నారు. శుక్రవారం త్యాగరాయగాన సభ నిర్వహణలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు కళాసుబ్బారావు కళావేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమానికి ఎన్టీఆర్ విశేషంగా కృషిచేశారని కొనియాడారు. తెలుగు భాషను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ... ఎన్టీఆర్ పౌరణిక, జానపదన సాంఘిక చిత్రాలలో వైవిద్య భరితమైన పాత్రలెన్నో పోషించి మెప్పించారన్నారు. ప్రముఖులు శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

గాంధీఆస్పత్రి: పొగాకు ఉత్పత్తుల సేవించడం ఆరోగ్యానికి హానికరమని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గాంధీఆస్పత్రి ప్రాంగణంలో పలు చైతన్య కార్యక్రమాలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతు పొగాకు ఉత్పత్తుల సేవనం వలన పలు రోగాలకు గురై ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 60 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని, కేన్సర్ మరణాల్లో 50 శాతం పొగాకు సేవించడం వలనే జరుగుగుతున్నాయని వివరించారు. పొగాకులో 60 రకాల కేన్సర్లు కలిగించే నాలుగు వేల రసాయనాలు ఉన్నాయని, సెకెండ్‌హ్యాండ్‌స్మోక్ కూడా అత్యంత ప్రమాదకరమన్నారు. పొగాకు ఉత్పత్తుల సేవనం వలన పలు రకాల కేన్సర్లతోపాటు గుండె, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఆల్జీమర్, పిల్లలు పుట్టే సామర్థ్యం తగ్గిపోవడం, మధుమేహం తదితర రుగ్మతలు వస్తాయని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పొగాకు ఉత్పత్తులు వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫల్మనాలజీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రతినిధి వెంకటరామనర్సయ్య, ఆర్ఎంఓలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.